పేటలో బీఆర్‌ఎస్‌దే విజయం

- ఆరు రౌండ్లు మినహా అన్నింటా గులాబీ పార్టీ ముందంజ
- ఐదు రౌండ్లలో కాంగ్రెస్, ఒక రౌండ్‌లో బీజేపీ ఆధిక్యం
- 4,606 ఓట్ల మెజార్టీతో ఆర్డీఆర్‌పై జగదీశ్‌రెడ్డి గెలుపు



సూర్యాపేట : సూర్యాపేట నియోజకవర్గ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సమీప ప్రత్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిపై 4,606 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నవంబర్‌ 30వ తేదీన జరిగిన ఎన్నికలకు గాను ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. సూర్యాపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపును జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డు గోదాంలో సూర్యాపేట ఎన్నికల అధికారి, స్థానిక ఆర్వో కె.వీరబ్రహ్మచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా 2,41,799 మంది ఓటర్లు ఉండగా 2,03,564 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో పాటు 3,117 మంది ఉద్యోగులు పోస్టల్‌ బ్యాలెట్‌ ద్వారా ఓటు వేశారు. కాగా బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి 75,143, కాంగ్రెస్‌ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి 70,537 ఓట్లు నమోదయ్యాయి. బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు 40,407 ఓట్లు సాధించారు.

20 రౌండ్లలో లెక్కింపు..

నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌ను 14 టేబుళ్లపై 20 రౌండ్లలో చేపట్టారు. మొదటి రౌండ్‌లో కాంగ్రెస్‌ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి 4418 ఓట్లు రాగా సమీప అభ్యర్థి జగదీశ్‌రెడ్డి కంటే 32 ఓట్ల మెజార్టీని సాధించారు. 2వ రౌండ్‌ నుంచి 12వ రౌండ్‌ వరకు బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మెజార్టీని సాధించి కొనసాగించారు. 13, 17, 18, 19వ రౌండ్లలో తిరిగి కాంగ్రెస్‌ అభ్యర్థికి స్వల్ప మెజార్టీ వచ్చినా.. అప్పటికే బీఆర్‌ఎస్‌ అభ్యర్థి 4వేల పైచిలుకు ఆధిక్యంలో కొనసాగుతుండడంతో కాంగ్రెస్‌ పుంజుకోలేకపోయింది. అదే విధంగా బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావుకు 7వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి జగదీశ్‌రెడ్డి కంటే 654 ఓట్ల మెజార్టీ వచ్చింది. కానీ మిగతా ఏ రౌండ్‌లోనూ ప్రభావం చూపకపోవడంతో సంకినేని మూడవస్థానానికి పరిమితం అయ్యారు.

చివరి వరకు ఉత్కంఠ..

బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి ప్రతి రౌండ్‌లో మెజార్టీ వచ్చినా ఎక్కువ సంఖ్యలో లేకపోవడంతో ఉత్కంఠ మొదలైంది. మొదటి 10 రౌండ్ల వరకు సమీప అభ్యర్థి దామోదర్‌రెడ్డి కంటే 3 వేల మెజార్టీ మాత్రమే ఉండటం చివరి 10 రౌండ్లపై కాంగ్రెస్‌కు ఆశలు ఉండటంతో ప్రతి రౌండ్‌లో ఉత్కంఠ కొనసాగింది.

పోస్టల్‌ బ్యాలెట్లలో కాంగ్రెస్‌దే ఆధిక్యం..!

నియోజకవర్గంలో 3,117 పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా కాంగ్రెస్‌ అభ్యర్థి దామోదర్‌రెడ్డికి 1846, బీఆర్‌ఎస్‌ అభ్యర్థికి 703, బీజేపీ అభ్యర్థికి 326, బీఎస్పీ అభ్యర్థికి 171 ఓట్లు పడ్డాయి. ఇక నోటాకు 14, చెల్లని ఓట్లు 28, తిరస్కరించిన ఓట్లు 8గా ఉన్నాయి.

నోటాకు 774 ఓట్లు..!

నియోజకవర్గవ్యాప్తంగా స్వతంత్ర అభ్యర్థులు అంతగా ప్రభావం చూపలేదు. కారును పోలిన గుర్తులు ఉన్నప్పటికీ గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేయడంతో ఓట్లు చీలలేదు. స్వతంత్ర అభ్యర్థుల్లో మర్రి నెహమియాకు మాత్రమే 1071 ఓట్లు వచ్చాయి. మిగతా వారు వెయ్యిలోపే పరిమితం అయ్యారు. ఇదిలా ఉండగా నోటాకు నియోజకవర్గ వ్యాప్తంగా 774 ఓట్లు పడ్డాయి.

సూర్యాపేటలో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	ఓట్లు
1. గుంటకండ్ల జగదీష్‌రెడ్డి	బీఆర్‌ఎస్‌	75143
2.దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్‌	70537
3.వట్టె జానయ్య	బీఎస్పీ	13,907
4.సంకినేని వెంకటేశ్వరరావు	బీజేపీ	40,407
5.కిరణ్‌కుమార్‌	డీఎస్పీ	404
6.వంగపల్లి కిరణ్‌	రిపబ్లిక్‌సేన	71
7.ఆంజనేయులు	జనశంఖారావం	73
8.రమేష్‌	బహుజనవిముక్తి	71
9.వరికుప్పల వెంకన్న	ఎంసీపీఐయూ	120
10.లింగిడి వెంకటేశ్వర్లు	ప్రజావాణి	235
11.రాజశేఖర్‌	యుగతులసి	221
12.కొత్తపల్లి రేణుక	ఇండిపెండెంట్‌	185
13.చామకూరి నర్సయ్య	ఇండిపెండెంట్‌	391
14.వెంకటేశ్‌	ఇండిపెండెంట్‌	542
15.మట్టిపెల్లి లింగయ్య	ఇండిపెండెంట్‌	432
16.నెహమియా	ఇండిపెండెంట్‌	1072
17.వెంకట్‌రెడ్డి	ఇండిపెండెంట్‌	961
18.లింగారెడ్డి	ఇండిపెండెంట్‌	252
19.మురళి	ఇండిపెండెంట్‌	679
20.ఈశ్వర్‌	ఇండిపెండెంట్‌	178
21.నోటా	-	774

ప్రజా తీర్పును స్వాగతిస్తున్నా

సూర్యాపేట నియోజకవర్గంలో ఓడినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌ పార్టీకి ప్రజలు అధికారం ఇచ్చారు. వారి తీర్పును స్వాగతిస్తున్నా. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేగా లేకున్నా పాటుపడుతా. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా. కాంగ్రెస్‌ పార్టీపై, తనపై విశ్వాసం ఉంచి ఓటువేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు.

– రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్‌ అభ్యర్థి

జగదీశ్‌రెడ్డి బయోడేటా

నియోజకవర్గం : సూర్యాపేట
పేరు : గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
తండ్రి పేరు : రామచంద్రారెడ్డి
తల్లి పేరు : సావిత్రమ్మ
భార్య : సునీత
పిల్లలు : వేమన్‌రెడ్డి, లహరి
స్వగ్రామం : నాగారం మండల కేంద్రం, తుంగతుర్తి నియోజకవర్గం
విద్యాభ్యాసం : బీఏ ఎల్‌ఎల్‌బీ
రాజకీయ ప్రవేశం : 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక, తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ అత్యంత సన్నిహిత అనుచరుడు
వరించిన పదవులు : 2014–18, 2018 –23 సూర్యాపేట శాసనసభ్యుడు, రాష్ట్ర కేబినేట్‌ మంత్రి

సామేల్‌ బయోడేటా

నియోజకవర్గం : తుంగతుర్తి
పేరు : మందుల సామేల్‌
పార్టీ : కాంగ్రెస్‌
తల్లిదండ్రులు : రామయ్య, సత్తమ్మ
భార్య : యాదమ్మ
పుట్టిన తేదీ : 14–07–1959
విద్యార్హత : డిగ్రీ
స్వస్థలం : ధర్మారం, అడ్డగూడూరు మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా.
రాజకీయ నేపథ్యం : బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. రెండు పర్యాయాలు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
మెజార్టీ : 51,093

తుంగతుర్తిలో ఎగిరిన కాంగ్రెస్‌ జెండా



సూర్యాపేటలో ఆర్వో నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న మందుల సామేల్‌

తిరుమలగిరి, అర్వపల్లి, నాగారం : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో 15 సంవత్సరాల తరువాత కాంగ్రెస్‌ పార్టీ ఘన విజయం సాధించింది. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన 2009 తరువాత మొదటిసారిగా కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌ 51,094 ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌పై విజయం సాధించారు. గత నెల 30వ తేదీన తుంగతుర్తి అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ గోదాంలో ఓట్ల లెక్కింపు జరిగింది. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 19 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. ప్రతి రౌండ్‌లో కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌ ఆధిక్యత కనబర్చారు. మందుల సామేల్‌కు 1,29,535(57.53శాతం) ఓట్లు రాగా బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు 78,441(34.84శాతం) ఓట్లు వచ్చాయి. మూడోస్థానంలో బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య 4,412(1.96శాతం) ఓట్లు సాధించారు.

అభ్యర్థులు సాధించిన ఓట్ల వివరాలు..

అభ్యర్థి పేరు	పార్టీ	సాధించిన ఓట్లు
1.మందుల సామేల్‌	కాంగ్రెస్‌	1,29,535
2.గాదరి కిషోర్‌కుమార్‌	బీఆర్‌ఎస్‌	78,441
3.కడియం రామచంద్రయ్య	బీజేపీ	4,412
4.బొడ్డు కిరణ్‌	బీఎస్పీ	1,399
5.ఈదుల వీరపాపయ్య	బీఎల్‌ఎఫ్‌	1621
6.కె.ఇందిరా	టీకేపీఐ	512
7.దాసరి బాలస్వామి	డీఎస్పీ	403
8.డి.జానయ్య	ఆర్పీఐ	310
9.ఎస్‌.నర్సింహా	బీఆర్‌ఎస్పీ	217
10.జి. అనంతయ్య	యుగతులసి	1,350
11.అరవింద్‌కుమార్‌	ఇండిపెండెంట్‌	2,197
12.రవిప్రసాద్‌	ఇండిపెండెంట్‌	763
13.మల్లయ్య	ఇండిపెండెంట్‌	2,221
14.శేఖర్‌	ఇండిపెండెంట్‌	434
15.నోటా		1,355

సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషా పద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్‌, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

క్లుప్తంగా

కాంగ్రెస్‌ గెలుపు.. ప్రజల గెలుపు

తుంగతుర్తి: తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ గెలుపు ప్రజల గెలుపు అని కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్‌ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌ అత్యధిక మెజార్టీతో గెలవడం హర్షణీయమన్నారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడిందని తెలిపారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌ ప్రభుత్వాన్ని కోరుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రాంమూర్తి, అశోక్‌, ఉప్పలయ్య, అజయ్‌, నాగరాజు, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు కృతజ్ఞతలు

నాగారం : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌ గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు, నాయకులకు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్‌ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌ నాయకులు నాతి వీరమల్లు, కన్నెబోయిన వెంకటభిక్షం, కడారి సోమయ్య, ఎల్మకంటి సోమయ్య, దరశథ తదితరులు ఉన్నారు.

జగదీశ్‌రెడ్డి గెలుపొందడంపై బీఆర్‌ఎస్‌ సంబరాలు

చివ్వెంల : సూర్యాపేట ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గెలుపును హర్షిస్తూ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు, బాణసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌ రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, పబ్బు సైదులు, కలకొండ శ్యాసన్‌, రావిచెట్టు సత్యం, యాసాని వెంకన్న, రాజ్‌కుమార్‌, వినయ్‌, ఇమామ్‌, మల్సూర్‌, వెంకన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యేగా మందుల సామేలు ఘన విజయం సాధించడంతో స్థానిక శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్‌ నోముల వంశీ, దేవాలయ మాజీ చైర్మన్‌ బైరబోయిన సైదులు, మహరాజు, అలువాల వెంకటస్వామి, కొమారి మహేష్‌, సాయిని అనిల్‌, కోటిప్రసాద్‌, కనుకు మహేష్‌, పులిచర్ల శివరాం, చిల్ల సైదులు, మేకల రాజు, కొప్పోజు అశోక్‌, పండు, కట్టెల రాము తదితరులు పాల్గొన్నారు.

విచారణ అధికారిగా అదనపు కలెక్టర్‌

దురాజ్‌పల్లి : పోలింగ్‌ అనంతరం తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించి రిజర్వ్‌లో ఉన్న ఈవీఎంలను ఎస్కార్ట్‌ లేకుండా తీసుకువెళ్తున్న సెక్టోరియల్‌ అధికారిని నాగారం మండలం పేరబోయినగూడేనికి చెందిన పలువురు కార్యకర్తలు అడ్డగించి వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై జిల్లా అదనపు కలెక్టర్‌ వెంకట్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించినట్లు కలెక్టర్‌ వెంకట్రావు ఆదివారం తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను అందజేయాలని పేర్కొన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్‌ : కోదాడ పట్టణ పరిధి హుజూర్‌నగర్‌రోడ్‌లోని గాలి రమేష్‌ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో దాతలు బట్టు రమణ, దేవరశెట్టి సురేష్‌లు మాలధారులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. 500 మంది మాలధారులు ఈ అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌ నాయుడు, బర్మావత్‌ సీతారాంసింగ్‌, గడ్డం సూర్యారెడ్డి, రంగా, నాగరాజు ఉన్నారు.

మండలాల వారీగా కాంగ్రెస్‌కు ఆధిక్యం ఇలా..



అర్వపల్లిలో ఓటేసేందుకు బారులుదీరిన జనం(ఫైల్‌)

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలో కాంగ్రెస్‌కు భారీ ఆధిక్యం లభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌కు బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌ కంటే 4697 ఓట్లు అధికంగా లభించాయి. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధితోపాటు గ్రామాల్లో కాంగ్రెస్‌ గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజార్టీ పొందింది. మండలంలో కాంగ్రెస్‌కు 15167 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 10470 ఓట్లు వచ్చాయి.

తుంగతుర్తి మండలంలో 7605 ఓట్ల మెజార్టీ

తుంగతుర్తి : అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి మండలంలో కాంగ్రెస్‌పార్టీకి 7,605 ఓట్ల మెజార్టీ వచ్చింది. మండలంలో 33,397మంది ఓటర్లు ఉండగా 29,206మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌కు 17,156, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు 9,551 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌ పార్టీకి 7605 ఓట్ల మెజార్టీ వచ్చింది. 2018 ఎన్నికల్లో తుంగతుర్తి మండలంలో బీఆర్‌ఎస్‌కు 2,800ఓట్ల మెజార్టీ వచ్చింది.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

అర్వపల్లి : ఎన్నికల ఫలితాల్లో జాజిరెడ్డిగూడెం మండలంలో కాంగ్రెస్‌కు 4,321 ఆధిక్యత లభించింది. జాజిరెడ్డిగూడెంలో 1,015, ఉయ్యాలవాడలో 158, అర్వపల్లిలో 128, రామన్నగూడెంలో 302, పర్సాయపల్లిలో 198, బొల్లంపల్లిలో 207, కాసర్లపహాడ్‌లో 441, వేల్పుచర్లలో 121, కుంచమర్తిలో 151, అడివెంలలో 379, తిమ్మాపురంలో 538, కొమ్మాలలో 215, కోమటిపల్లిలో 6, సూర్యానాయక్‌తండాలో 146, కోడూరులో 229, నాణ్యతండాలో 14, లోయపల్లిలో 73 ఓట్లు కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చాయి. కాగా సీతారాంపురంలో 19, కొత్తగూడెంలో 22 ఓట్లు బీఆర్‌ఎస్‌కు ఆధిక్యత లభించింది.

నాగారం మండలంలో 5,799 ఓట్ల ఆధిక్యం

నాగారం : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో నాగారం మండలంలో కాంగ్రెస్‌ పార్టీకి 5,799 ఓట్ల ఆధిక్యం దక్కింది. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 29 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 23,691 మంది ఓటర్లు ఉన్నారు. కాగా వీరిలో మొత్తం 20,631 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో మండలంలో 87.08 శాతం పోలింగ్‌ నమోదైంది. ఆదివారం ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో తుంగతుర్తి కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌కు 12,416, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు 6,617, బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్యకు 438ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌ అభ్యర్థి సామేల్‌, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కిషోర్‌కుమార్‌పై 5,799 ఆధిక్యం సాధించారు.

మద్దిరాలలో కాంగ్రెస్‌కు 3533 ఓట్ల ఆధిక్యం

మద్దిరాల : మద్దిరాల మండలంలో మొత్తం 24,665 మంది ఓటర్లు ఉండగా 21,582 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీఆర్‌ఎస్‌కు 8069ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 11602 ఓట్లు వచ్చాయి. మొత్తంగా మండలంలో కాంగ్రెస్‌కు 3533 ఓట్ల ఆధిక్యం లభించింది.

కాంగ్రెస్‌ పార్టీ నాయకుల గెలుపు సంబరాలు



మద్దిరాలలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్‌ నాయకులు



నాగారంలో సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు

తిరుమలగిరి : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌ ఘన విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు ఆదివారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్‌, దుంపల కృష్ణారెడ్డి, సుంకరి జనార్దన్‌, పేరాల వీరేష్‌, రాపాక సోమేష్‌, ఎండీ.హఫీజ్‌, అంబేద్కర్‌, నవీన్‌, మోహన్‌, కలీం, అబ్బాస్‌, రాముగౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌ గెలుపొందటంతో ఆదివారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్‌ శ్రేణులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. బాణ సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అలాగే కొత్తగూడెంలో బీఎన్‌ విగ్రహానికి కాంగ్రెస్‌ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు దొంగరి గోవర్ధన్‌, దొనకొండ రమేష్‌, నకిరేకంటి విజయ్‌, అయోధ్య, లింగయ్య, ఓరుగంటి సత్యనారాయణ, సోమయ్య, వెంకన్న, రాములు, వీరయ్య, గురుమూర్తి, కొమిరెల్లి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్‌ : మందుల సామేల్‌ భారీ మెజార్టీతో గెలుపొందడంతో మండల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామ గ్రామాన బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అర్వపల్లి : తుంగతుర్తి ఎమ్మెల్యేగా మందుల సామేలు ఘన విజయం సాధించడంతో ఆదివారం కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో అర్వపల్లిలో బాణసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌ రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్‌, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్‌, బైరబోయిన సైదులు, మహరాజు, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

మద్దిరాల : కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌ తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా యువజన నాయకుడు ఎల్లు అశోక్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అవిలమల్లు, జగన్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, గుండ్ల కొమరయ్య, సుధాకర్‌రెడ్డి, వెంటయ్య, మద్దెల భిక్షపతి, మద్దెల రాములు, యాకయ్య, విజయ్‌, లింగయ్య, అమృతమల్లు, ఉపేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌ ఘన విజయం సాధించడంతో ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పాశం యాదవరెడ్డి, నాతి వీరమల్లు, కన్నెబోయిన వెంకటభిక్షం, కడారి సోమయ్య, ఎల్మకంటి సోమయ్య, దరశథ, గుంటకండ్ల ముకుందారెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, అశోక్‌రెడ్డి, బయ్యం వెంకన్న, రాజేష్‌, అశోక్‌రెడ్డి, బాలకృష్ణ, వెంకన్న, అంజయ్య, సతీష్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్‌ : ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ భారీ విజయం సాధించడంతో మండల పరిధిలోని గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, సుమంత్‌, రవి, వెంకటేష్‌ పాల్గొన్నారు.



తిరుమలగిరిలో..



తుంగతుర్తి : కొత్తగూడెంలో..



అర్వపల్లిలో జరిగిన సంబరాల్లో మహిళలు



నూతనకల్‌ : మిర్యాలలో విజయోత్సవ ర్యాలీ..



తుంగతుర్తి : కొత్తగూడెంలో బీఎన్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



నూతనకల్‌ మండల కేంద్రంలో..



మద్దిరాల : కుక్కడంలో..



పెన్‌పహాడ్‌లో..

కౌంటింగ్‌ ప్రశాంతం

- ఉదయం 8గంటలకే ప్రారంభమైన లెక్కింపు
- అభ్యంతరాలు, ఇబ్బందులు లేకుండా సాగిన ప్రక్రియ
- మొదటగా హుజూర్‌నగర్‌, చివరగా కోదాడ ఫలితాలు వెల్లడి



ఈవీఎంలు లెక్కిస్తున్న కౌంటింగ్‌ సిబ్బంది

సూర్యాపేట: జిల్లా వ్యవసాయ మార్కెట్‌ యార్డులో ఆదివారం చేపట్టిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8గంటలకే పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్ల లెక్కింపుతో ఈ ప్రక్రియను ప్రారంభించారు. 8.30గంటలకు నాలుగు నియోజకవర్గాల ఈవీఎంల లెక్కింపును చేపట్టారు. ఈ ప్రక్రియను కలెక్టర్‌ వెంకట్రావ్‌, ఎస్పీ రాహుల్‌ హెగ్డే, అదనపు కలెక్టర్‌ సీహెచ్‌.ప్రియాంకతో పాటు ఎన్నికల అబ్జర్వర్లు పర్యవేక్షించారు. కౌంటింగ్‌ ప్రక్రియ ఎలాంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేకుండా సాగింది. ఈవీఎంలు మొరాయించడం లాంటి ఇతర సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాలేదు. అయితే కోదాడ నియోజకవర్గానికి సంబంధించిన ఫలితాల వెల్లడి నెమ్మదిగా సాగింది.

పోలింగ్‌ కేంద్రాల వారీగా కౌంటింగ్‌..

ప్రతి నియోజకవర్గంలో మొదటి పోలింగ్‌ కేంద్రం నుంచి చివరి పోలింగ్‌ కేంద్రం వరకు వరస క్రమంలో కౌంటింగ్‌ ప్రక్రియ చేపట్టారు. హుజూర్‌నగర్‌ నియోజకవర్గంలోని 308 కేంద్రాలకు 18 టేబుళ్లను ఏర్పాటు చేసి 18 రౌండ్లలో కౌంటింగ్‌ ప్రక్రియ పూర్తి చేశారు. కోదాడ నియోజకవర్గంలోని 296 పోలింగ్‌ కేంద్రాలకు 16 టేబుళ్లను ఏర్పాటు చేసి 19 రౌండ్లలో కౌంటింగ్‌ చేపట్టారు. సూర్యాపేట నియోజకవర్గంలోని 271 పోలింగ్‌ కేంద్రాలకు 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 20 రౌండ్లలో కౌంటింగ్‌ నిర్వహించారు. అదేవిధంగా తుంగతుర్తి నియోజకవర్గంలోని 326 పోలింగ్‌ కేంద్రాలకు 18 టేబుళ్లను ఏర్పాటు చేసి 18 రౌండ్లలో కౌంటింగ్‌ నిర్వహించారు. ఇందులో హుజూర్‌నగర్‌ ఫలితం మొదటగా వచ్చింది. తర్వాత తుంగతుర్తి, సూర్యాపేట, చివరగా కోదాడ ఫలితాలు వెలువడ్డాయి.

శ్రీకాంతాచారికి నివాళి

మునగాల : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిదని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్‌ అన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌ పార్టీ నిరుద్యోగులకు జాబ్‌ కేలండర్‌ ప్రకటించి నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. తెలంగాణలో ఉచిత విద్య, వైద్యం, గృహనిర్మాణం లాంటి అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సిరికొండ అజయ్‌, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, రచ్చ ఉపేందర్‌, మండవ వెంకన్న, తోకల సతీష్‌ పాల్గొన్నారు.



శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణయాదవ్‌

జగదీశ్‌రెడ్డి స్వగ్రామంలో కాంగ్రెస్‌కు 339 ఓట్ల మెజార్టీ

నాగారం : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి జగదీశ్‌రెడ్డి స్వగ్రామమైన నాగారంలో కాంగ్రెస్‌కు 339ఓట్ల ఆధిక్యం లభించింది. ఈ గ్రామంలో మొత్తం 2,212 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,912 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆదివారం ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌కు 1,000 ఓట్లు, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు 661, బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్యకు 141 ఓట్లు వచ్చాయి. దీంతో ఈ గ్రామంలో కాంగ్రెస్‌ అభ్యర్థి మందుల సామేల్‌.. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌పై 339 ఓట్ల మెజార్టీ సాధించారు. కాగా నాగారం గ్రామం మందుల సామేల్‌కు అమ్మమ్మ ఊరు కావడం గమనార్హం. మంత్రి స్వగ్రామంలో కాంగ్రెస్‌పార్టీకి ఆధిక్యం రావడం పట్ల కాంగ్రెస్‌ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ స్వగ్రామంలో 217 మెజార్టీ

తుంగతుర్తి : తుంగతుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో జెడ్పీచైర్‌పర్సర్‌ గుజ్జ దీపికాయుగేందర్‌రావు స్వగ్రామమైన తుంగతుర్తి మండలం తూర్పుగూడెం గ్రామంలో కాంగ్రెస్‌ పార్టీకి 217 ఓట్ల మెజార్టీ వచ్చింది. తూర్పుగూడెం గ్రామంలో మొత్తం 1594 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1420 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆదివారం ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మందుల సామేల్‌కు 769, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్‌కు 552 ఓట్లు వచ్చాయి. దీంతో కాంగ్రెస్‌ పార్టీకి 217ఓట్ల ఆధిక్యం లభించింది.

ప్రణాళికతో పనిచేశాం

సూర్యాపేట క్రైం: ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రణాళికతో పనిచేశామని ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు కల్పించామని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్‌ను జిల్లా ఎన్ని కల అధికారి కలెక్టర్‌ వెంకట్రావుతో కలిసి పర్యవేక్షించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖకు సహకరించిన ఓటర్లకు, ఉద్యోగులకు, మీడియా ప్రతినిధులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల బందోబస్తులో అనునిత్యం శ్రమించి పని చేసిన జిల్లా పోలీసు సిబ్బందిని అభినందించారు.